క్లుప్తంగా

ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ మాల్యాద్రి

కొండపి: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు త్వరిగతిన పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎం.మాల్యాద్రి తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో ఆయన మాట్లాడారు. మండలంలో 5875 మంది రైతులు లబ్ధిదారులుగా ఉన్నారని, ప్రభుత్వం నూతనంగా ఇనాం భూములకు అసైన్మెంట్ భూములకు చెందిన రైతులను 596 మంది కొత్తగా ఈ పథకానికి అర్హులుగా చేర్చిందన్నారు. కొత్తగా అర్హులైన వారితో మొత్తం 6471 మంది రైతులు లబ్ధిదారులుగా గుర్తించామని తెలిపారు. దాదాపు రైతులందరూ ఈ కేవైసీను పూర్తి చేసుకున్నారని, కేవలం 39 మంది రైతుల మాత్రమే పెండింగ్‌లో ఉన్నారని తెలిపారు.

229 బేళ్లు తిరస్కరణ


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 229 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1131 బేళ్లను వేలానికి తీసుకురాగా 902 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.251.78గా నమోదైంది. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి.
టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం జరిగిన వేలంలో 189 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 939 బేళ్లను వేలానికి తీసుకురాగా 750 బేళ్లను కొనుగోలు చేసి 189 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.235.73గా నమోదైంది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి


ఆనికాలపల్లిలోమొక్కలు నాటుతున్న హెచ్‌ఎం

కొండపి: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కొండపి ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో వన సంరక్షణ లో భాగంగా ఆయన చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఏఓ రామకృష్ణ, కళాశాల సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
సీఎస్‌పురం(పామూరు): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆనికాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జె.భారతి అన్నారు. మండలంలోని ఆనికాలపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం మొక్కలు నాటారు. భావితరాలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే నేటి తరం విధిగా మొక్కలు నాటి పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

గోకులం షెడ్లు.. బిల్లుల రాక గగ్గోలు

- త్వరితగతిన నిర్మించాలని అధికారుల ఒత్తిడి
- అప్పులు చేసి నిర్మించిన లబ్ధిదారులు
- పైసా కూడా రాకపోవడంతో లబ్ధిదారుల నిరీక్షణ


నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్డు

కనిగిరిరూరల్: పాలకుల హడావిడి, అధికారుల వత్తిడితో లబ్ధిదారులు అప్పులు చేసి గోకులం షెడ్లు నిర్మించారు. కానీ వీటి నిర్మాణం పూర్తయి ఆరు నెలలు దాటినా ఇంత వరకు బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. నిర్మాణాల ప్రారంభంలో నిత్యం త్వరితగతిన పూర్తి చేయాలని వేధించిన అధికారులు.. ఆ తర్వాత నిధులు మంజూరు కాలేదంటూ చేతులు దులుపుకొని వారి పనిలో వారు నిమగ్నమవుతున్నారు. మధ్యలో అప్పులు చేసి నిర్మించిన లబ్ధిదారులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

ఇదీ పరిస్థితి..
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం గోకులం పథకం పేరుతో పాడి రైతులకు పాడి, పశు పోషణకు షెడ్లు మంజూరు చేసింది. అయితే ఈ షెడ్ల నిర్మాణ లబ్ధిదారుల ఎంపికకు కమిటీ (ఉపాధి ఏపీఓ, ఎంపీడీఓ, పశువర్ధక శాఖ ఏడీ, పశువైద్యాధికారి, వెలుగు ఏపీఎం)లను నియమించినా.. వారు పూర్తిగా అధికార పార్టీకి చెందిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారనే ఆరోపణలు, విమర్శలు లేకపోలేదు. కనిగిరి ఎన్ఆర్ఈజీఎస్ క్లస్టర్ పరిధిలోని 7 మండలాల్లోని 159 పంచాయతీల్లో 143 గోకులం షెడ్లు మంజూరు కాగా, అందులో 85 పూర్తయినట్లు సమాచారం.

ఒత్తిడి చేసి మరీ..
గోకులం షెడ్లను అధికారులపై వత్తిడి చేయించి మరీ లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టి హడావుడిగా పూర్తి చేయించారు. గోకులం షెడ్ల నిర్మాణాల బిల్లులు మూడు దశల్లో లబ్ధిదారులకు అందాల్సి ఉంది. అయితే బిల్లులు ఒక్క దశలో కూడా పూర్తిగా పడక పోయినా ఎక్కువ శాతం మంది అప్పులు చేసి మరీ పూర్తి చేశారు. మూడు బిల్లులు కలిపి ఒకే సారి నిధులు పడతాయని, సిస్టంలో పూర్తిగా అప్‌లోడ్ చేశామని నిధుల రావడమే తరువాయి అంటూ అధికారులు లబ్ధిదారులను బుకాయించారు. జనవరి 10,12 వ తేదీల్లో షెడ్యూల్స్ పెట్టుకుని అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మండల, గ్రామ స్థాయి నేతలు వాటిని అట్టహాసంగా ప్రారంభించారు. దాదాపు కోట్లలోనే బిల్లులు రావాల్సి ఉంది. కానీ ఆరు నెలలు దాటినా బిల్లులు అందక పోవడంతో కొందరు లబ్ధిదారులు అధికారులపై వత్తిడి చేస్తున్నారు. షెడ్లను ప్రారంభించి నెలలు అవుతున్నా.. బిల్లులు ఇంకా ఖాతాల్లో జమ కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. కాగా ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు మాత్రం పూర్తి అయిన గోకులం షెడ్ల నిర్మాణాల పూర్తి వివరాలు గతంలో సిస్టంలో అప్‌లోడ్ చేసినా.. మరలా సాఫ్ట్‌వేర్ మారడంతో తాజాగా వారం రోజుల క్రితం కొత్త సాఫ్ట్‌వేర్‌లో బిల్లుల పేమెంట్‌కు లబ్ధిదారుల డేటాను అప్‌లోడ్ చేసినట్లు అధికారులు చెప్తున్నారు.

ఏపీఓ ఏమంటున్నారంటే..
దీనిపై కనిగిరి ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలరావును వివరణ కోరగా..కొత్త స్టాఫ్‌వేర్‌లో వివరాలను నమోదు చేశామని, వారం రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమవుతుందని తెలిపారు.

రూ 2.30 లక్షల గోకులం షెడ్ల నిర్మాణాలే అధికం

ఈ పథకం కింద నిర్మించే షెడ్లు మూడు రకాలు ఉన్నా... ఎక్కువగా 6 ఎనుముల షెడ్లనే నిర్మించుకున్నారు. దానికి సంబంధించి రూ.2.30 లక్షల చొప్పున నిధులు మంజూరవుతాయి. ఇందులో లబ్ధిదారుని వాటా రూ.30 వేలు ఉండగా.. ప్రభుత్వం రూ. 2లక్షలు అందచేస్తోంది. గోకులం షెడ్ల నిర్మాణాల పనులను డిసెంబర్ నాటికి సగభాగం పూర్తి కాగా మిగిలినవి కూడా పూర్తి చేసినట్లు సమాచారం.


గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

కనిగిరి క్లస్టర్ పరిధిలోని గోకులం షెడ్ల వివరాలు

మండలం పేరు	పంచాయతీలు	మంజూరైనవి	పూర్తయినవి
సీఎస్‌పురం	23	15	3
హనుమంతునిపాడు	23	20	10
కనిగిరి	25	20	15
పామూరు	25	22	15
పీసీపల్లి	18	21	10
పొన్నలూరు	24	20	9
వెలిగండ్ల	21	25	23
మొత్తం	159	143	85

భూముల సవరణకు అవకాశం


సమావేశంలో మాట్లాడుతున్న డీటీ ప్రసాద్

సింగరాయకొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఆన్‌లైన్ లో భూముల తప్పుల సవరణలకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని డిప్యూటీ తహశీల్దార్ తానికొండ ప్రసాద్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం భూముల తప్పుల సవరణలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. డీటీ ప్రసాద్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం వర్తించాలంటే 10 ఎకరాల లోపు పొలం ఉండాలని, కానీ కొంతమందికి రీసర్వేలో తప్పుల కారణంగా 10 ఎకరాల కన్నా ఎక్కువ నమోదు అయ్యాయని, దీంతో వారికి పథకం వర్తించదన్నారు. ఇటువంటి వారు ఆన్‌లైన్ జరిగిన తప్పులను సరిచేసుకోవాలని ఆయన సూచించారు. మండల సర్వేయర్ బ్రహ్మం, గ్రామసర్వేయర్ సాయి, ఏఎస్ఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.
పామూరు: మండలంలో రీసర్వే పూర్తి అయిన 10 రెవెన్యూ గ్రామాలలో జాయింట్ ఎల్‌పీఎం కలిగిఉన్న రైతులు సింగిల్ ఎల్‌పిపీంకోసం ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తుచేసుకోవాలని తహసీల్దార్ రామ చంద్రుని వాసుదేవరావు పేర్కొన్నారు. మండలంలోని రీసర్వే పూర్తి అయిన 10 రెవెన్యూ గ్రామాలు అనుమలకొండ, బలిజపాలెం, మోట్రావులపాడు, చిలకపాడు, వగ్గంపల్లి, నాసికాత్రయంబకం, పుట్టంనాయునిపల్లి, కరోళ్లపాడు, దాదిరెడ్డిపల్లె, కంబాలదిన్నె రెవెన్యూ గ్రామాల్లో జాయింట్ ల్యాండ్ పొజిషన్ మ్యాప్ (యల్‌పియం) కలిగిన లబ్ధిదారుల భూములకు సంబంధించి విస్తీర్ణం అధికంగా నమోదు చూపడంతో వారి పిల్లలు తల్లికి వందనంలో అనర్హత పొందారని, తక్షణం సింగిల్ ఎల్‌పీఎంగా మార్చుకోవడం కోసం సబ్‌డివిజన్ ప్రక్రియ చేసేందుకు నెలాఖరు వరకు అవకాశం ఉందన్నారు. రైతులు వెంటనే ఖాస్తుచేసుకోవాలన్నారు. సింగిల్ ఎల్‌పీఎం ద్వారా వారి వాస్తవిక భూమి రికార్డుల్లో ఉంటుందని తద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హత సాధిస్తారన్నారు.

రైతుల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం

ఉలవపాడు: పచ్చని పంటలు పండే భూములను భారీ పరిశ్రమలకు కేటాయిస్తామని సూపర్ సిక్స్ పథకాలలో చెప్పలేదు కదా అని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు సీఎం చంద్రబాబు నాయుడుని శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సుమారు నాలుగువేల ఎకరాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తూ ప్రకటించడం రైతులు, ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. భూములతో పాటు కొన్ని వందల ఇళ్లు కూడా ఖాళీ చేయాలని నోటిఫికేషన్‌ను ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రైతుల భూములను బడ పారిశ్రామిక వేత్తలకు వేల ఎకరాలను కట్టబెడితే అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. రైతుల పొట్ట కొట్టే కార్యక్రమం చేస్తూ అధికారం ఉంది కదా అని వ్యవహరిస్తే రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాలకొండ ఆదాయం రూ.11 లక్షలు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం శనివారం రూ.11.50 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.22,040, తలనీలాలు రూ.61,975, ప్రత్యేక దర్శనం రూ.4,27,700, రూమ్ అద్దెలు రూ.33,410, లడ్డు ప్రసాదాలు రూ.2,45,940, అన్నదారం రూ.3,15,215 ఇతర విరాళాలు కలిపి ఆదాయం రూ.11,50,640 వచ్చినట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ సమస్యలపై 23న చలో కలెక్టరేట్


సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉలవపాడు: అంగన్‌వాడీల సమస్యలపై ఈ నెల 23వ తేదీన చేపట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎస్ఆర్ఎఫ్ యాప్‌ను రద్దు చేయాలని, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని, మినీ వర్కర్లను, మెయిన్ వర్కర్లుగా జీవో విడుదల చేయాలన్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామని, ఈ ధర్నాకు అవకాశం ఇవ్వాలని ఉలవపాడు సీడీపీఓ మాధవిలతకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీహెచ్ ఇందిరావతిలు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయకుడు నెలకు రూ.25 వేలు ఆదాయం వచ్చే ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి తల్లికివందనం అంగన్‌వాడీలకు వేయకుండా మొండి చేయి చూపించారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జీవీబీ కుమార్, గుడ్లూరు మండల కార్యదర్శి కొట్టే వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మానవ జీవితంలో యోగా భాగం అవ్వాలి

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగాసనాలు వేసిన విద్యార్థులు, ప్రజలు


కందుకూరులో టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు

కందుకూరు రూరల్: మానవ జీవతంలో యోగా భాగం అవ్వాలని యోగా శిక్షకులు పేర్కొన్నారు. కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్ కె.కరుణ రత్నకుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కె.నరేష్ రాజా పర్యవేక్షణలో సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా మీద అవగాహన కల్పించారు. యోగాపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగు పర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని ఓగూరు వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో యోగా గురువు శ్రీరామచంద్రమూర్తి, కళాశాల అసోసియేట్ డీన్ వీ విజయభాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.శిరీష ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రం, యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేశారు.

ఉలవపాడులో యోగా
ఉలవపాడు: మండల పరిధిలో యోగా దినోత్సవాన్ని ఎంపీడీఓ విజయకుమారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రంథాలయంలో యోగా దినోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెంలో..
వలేటివారిపాలెం: మండల కేంద్రం వలేటివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపీడీవో నరేంద్ర దేవ్ అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వలన శారీరక మానసిక, ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. కార్యాక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఐజాక్, మహిళలు పాల్గొన్నారు.

ఐటీఐలో రెండో విడత దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు రూరల్: కందుకూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి మొదటి విడతలో వివిధ ట్రేడుల్లో మిగిలిన ఖాళీ సీట్లు రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీ.నాగేశ్వరరావు తెలిపారు. పదో తరగతి, ఆపై అర్హత కలిగిన విద్యార్థులు జులై 15వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కందుకూరులోని ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చే వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని చెప్పారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, కోపా ట్రేడుల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 97040 18584 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చెర్లోపాలెంలో స్వర్ణాంధ్ర


కందుకూరులో నీరు-మీరు కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు

వలేటివారిపాలెం: మండలంలోని చెర్లోపాలెం అంగన్‌వాడీ సెంటర్లో సీడీపీవో శర్మిష్ట సూచనలు మేరకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అధ్యర్యంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యాక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఆమె అన్నారు. తదనంతరం గ్రామస్తులు, పిల్లలు చేత స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. కార్యాక్రమంలో పాఠశాల హెచ్‌ఎమ్ రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు వసుంధర, ఎంఎస్‌కె సుమలత, ఏఎన్‌ఎమ్ లావణ్య, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.
కందుకూరు రూరల్: మండలంలోని ఓగూరు వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో నీరు–మీరు, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ వి.విజయభాస్కర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పరిశుభ్రతతోపాటు చెత్త నుంచి సంపద సృష్టించాలనే నినాదంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


కనిగిరిలో పాల్గొన్న ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, చైర్మన్ గఫార్ తదితరులు



ర్యాలీ నిర్వహిస్తున్న కదిరి వ్యవసాయ, ఉద్యానవన కళాశాల విద్యార్థులు

కనిగిరిరూరల్: యోగాతో మానసిక ప్రశాంతత కల్గుతుందని ఆర్డీఓ బి కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ బి కేశవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యోగాతో మంచి ఆరోగ్యం లభిస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్, తహసీల్దార్ రవి శంకర్, ఇన్‌చార్జి కమిషనర్ మాధవరావు, మేనేజర్ ప్రసాద్, ఏఓ జైలాబ్దిన్, పల్లా కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగా ఆసనాలు, ప్రాణాయమం, ధ్యానం చేశారు.
సీఎస్‌పురం(పామూరు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ జె.ప్రసాదరావు, సీడీపీఓ కృపావరం, పీఎస్ వి.బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్ విద్యార్థులచేత యోగా చేయించి అవగాహన ర్యాలీ చేపట్టారు. పీడీ బండారు రవీంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
పీసీపల్లి: మండలంలోని పెదఆలవలపాడులో తహసీల్దార్ ఉషా ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంపీడీఓ హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.
హనుమంతునిపాడు: హనుమంతునిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం రంగ సుబ్బరాయుడు, ఎంపీటీసీ సుబ్బారెడ్డి, సర్పంచ్ కత్తి రాజారావు ఎంఈఓలు జి.పెద్దిరాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.
కొండపి: కొండపి వేలం కేంద్రంలో వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, అఖిల భారత రైతు సంఘం సెక్రటరీ పోటు మురళి బాబు, రైతులు పాల్గొన్నారు.
పొన్నలూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ డాక్టర్ సుజాత, ఎంఈఓలు రవిచంద్రబాబు, హరిబాబు, పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
టంగుటూరు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు. పొగాకు వేలం కేంద్రం, టోల్ ప్లాజాలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.
కొండపి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏఓ రామకృష్ణ యోగా దినోత్సవం నిర్వహించారు. అదే విధంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సొంత వాహనాలను ట్యాక్సీలుగా ఉపయోగిస్తే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

కందుకూరు: సొంత కార్లను ట్యాక్సీలుగా ఉపయోగించి ప్రయాణికులను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీఎస్ లక్ష్మీ అన్నారు. శనివారం రవాణా శాఖ ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో ఆమె పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ట్యాక్సీలుగా ఉపయోగిస్తున్న రెండు కార్లను గుర్తించి సీజ్ చేశారు. వాటి యజమానులకు జరిమానాలు విధించారు. రావాణా శాఖ అనుమతి లేకుండా సొంత కార్లను ట్యాక్సీలుగా ఉపయోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్యాక్సీలుగా అనుమతి పొందిన వాహనాలను మాత్రమే ప్రయాణికుల రవాణా కోసం ఉపయోగించాలన్నారు. తనిఖీల్లో నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంవీఐ గోపీనాయక్, కావలి ఏఎంవీఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.